క్లుప్తంగా

సీజ్ చేసిన ఇసుకకు 30న వేలం

నాగాయలంక:మండల పరిధిలో గత నెల 30వ తేదీన వక్కపట్లవారిపాలెం వద్ద అనుమతులు లేకుండా తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన టిప్పర్‌లో లోడ్‌కు సంబంధించిన 15 టన్నుల ఇసుకకు 28న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు స్థానిక తహసీల్దార్ ఎం.హరనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాల్టా చట్టం కింద కేసు నమోదు చేసిన తర్వాత ఎస్‌ఐ కలిదిండి రాజేష్ ఇసుక లోడ్‌తో ఉన్న టిప్పర్‌ను అవనిగడ్డ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌లో సమర్పించారు. 18న కోర్టు ఇచ్చిన అఫిషియల్ ఆర్డరు, 24న నాగాయలంక సబ్ ఇన్‌స్పెక్టర్ లేఖ దాఖల ప్రకారం టిప్పర్‌లోని సుమారు 15 టన్నుల ఇసుకను ప్రభుత్వ నిబంధనలు ప్రకారం 28వ తేదీ వేలం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి కలవారు తమ కార్యాలయంలో జరిగే బహిరంగ వేలంలో పాల్గొని పాట ద్వారా ఇసుక పొందవచ్చునని తెలిపారు.

భవిత కేంద్రాలతో మానసిక చైతన్యం



పెడన:ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ప్రతి రోజు భవిత కేంద్రానికి తీసుకొస్తే వారిలో కొంత మానసిక చైతన్యం వస్తుందని సమగ్ర శిక్షణ కృష్ణా జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎస్.రాంబాబు అన్నారు. ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించే హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా శనివారం ఆయన పట్టణంలోని 11వ వార్డు కాపులవీధిలో గల ప్రత్యేక అవసరాలు గల విద్యార్థిని ఇంటిని సందర్శించి తల్లిదండ్రులకు పలు సూచనలు ఇచ్చారు. విద్యార్థికి అందుతున్న అలవెన్సులు, రాయితీలు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిత కేంద్రానికి రాగల విద్యార్థులను తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీవో కె. ఏడుకొండలు, ఐఈఆర్పీ రమ్య తదితరులున్నారు.

అనుమతులు వచ్చేలా చూడాలి

అవనిగడ్డ:దివిసీమలో అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల పునర్నిర్మాణానికి రూ.38.75 కోట్ల అంచనాలతో పంపిన ప్రతిపాదనలకు అనుమతులు వచ్చేలా చూడాలని ఇరిగేషన్ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావుని శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ఆదేశించారు. డీఈగా పదోన్నతి పొందిన తరువాత వెంకటేశ్వరరావు శనివారం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖలో చేపట్టనున్న పనులన్నింటినీ సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఆ శాఖకు సంబంధించిన ప్రతిపాదనలన్నింటికి ఆమోదం లభించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు రాంకుమార్, రవితేజ, టి ప్రసాద్, చిరంజీవి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన



బంటుమిల్లి: పీఎం ఎస్‌హెచ్‌ఆర్‌ఐ ఇండస్ట్రీయల్ విజిట్‌లో భాగంగా బంటుమిల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10 తరగతుల విద్యార్థులు బంటుమిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ విద్యుత్ ఏఈఈ ఎం. రవికుమార్ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్‌ల పనితీరు, విద్యుత్ సరఫరా మొదలైన వాటి గురించి వారికి వివరించారు. హెచ్‌ఎం వెంకట్రావ్, పీడీ ఫణికృష్ణ, ఒకేషనల్ ఉపాధ్యాయులు సర్వేశ్వరరావు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అవనిగడ్డ:నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన 15 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.6,48,069 విలువగల చెక్కులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అందించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో ఈ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఇసుక క్వారీల్లో తవ్వకాలు చేస్తే చర్యలు

ఘంటసాల: మండలంలోని శ్రీకాకుళం, పాపవినాశనం ఇసుక క్వారీల్లో ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని తహసీల్దార్ బి.వి జయ ప్రసాద్ హెచ్చరించారు. కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం పాపవినాశనం గ్రామాల్లోని కృష్ణానది ప్రవాహం పెరిగిందన్నారు. అందువల్ల ఇసుక అవసరమైన ప్రజలు నది ఉధృతి తగ్గిన తర్వాత మాత్రమే ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు ద్వారా ఇసుక రవాణ చేసుకోవాలని చెప్పారు. ఎటువంటి మిషనరీలు ఉపయోగించకుండా కేవలం మనుషుల ద్వారానే తవ్వకాలు జరపాలని తెలిపారు. ఇసుక గుట్టలగా నిల్వ చేసినా, తవ్వకాలు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పడకేసిన పారిశుద్ధ్యంతో పాట్లు

- గ్రామాల్లో అడుగడుక్కి దర్శనమిస్తున్న చెత్తాచెదారం
- సీజనల్ వ్యాధులతో బెంబేలెత్తుతున్న ప్రజలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



చిలకలపూడి నుంచి కరగ్రహారానికి వెళ్లే మార్గంలో రోడ్డు వెంబడి పేరుకుపోయిన చెత్తాచెదారం

కోనేరుసెంటర్: మండలంలో పడకేసిన పారిశుద్ధ్యంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇప్పటికే సీజనల్ వ్యాధులతో సతమతమవుతుంటే మరో పక్క గ్రామాల్లో పరిశుభ్రత లేకపోవడంతో జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ గ్రామంలో చూసినా చెత్తా చెదారం, ఇతర వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. పంచాయతీ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎటుచూసినా మురుగు గుంతలు, చెత్త కుప్పలే కన్పిస్తున్నాయి. రోడ్ల వెంబడి జంతుకళేబరాలతో దారుణమైన దుర్వాసన వస్తోంది. పలు గ్రామాల ప్రజలు రోగాలబారిన పడి ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలో 34 పంచాయతీలు ఉండగా సుమారు 105 గ్రామాలు ఉన్నాయి. వీటిలో అనేక గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్తాచెదారం దర్శనమిస్తోంది. వీటితో పాటు అనేక గ్రామాల్లో ఇప్పటికీ రోడ్లు వేయకపోవటంకు తోడు డ్రైనేజీ వసతి సరిగా లేకపోవటంతో మురుగునీరు పారుదల లేక గృహాల మధ్య తిష్టవేస్తున్నాయి. దోమలు వ్యాప్తి చెందటంతో బాధిత గ్రామాల ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. ఉన్న సమ్యలు చాలవన్నట్టు గ్రామాల్లో అనారోగ్యంతో మృత్యువాతపడిన మూగజీవాల కళేబరాలను స్థానికులు గృహాలకు సమీపంలోని రోడ్ల వెంబడి విసిరేస్తున్నారు. వాటి నుంచి వచ్చే దుర్వాసనతో ఇతరులు నానా తిప్పలు పడుతున్నారు. అలాంటి గ్రామాల్లోకి అడుగు పెట్టాలంటే అరికిలోమీటర్ ముందుగానే ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

సీజనల్ వ్యాధులతో సతమతం....

మండలంలో పారిశుద్ధ్యం పడకేయటంతో ప్రజలు సీజనల్ వ్యాధులతో భయపడుతున్నారు. ఇటీవల మండల వ్యాప్తంగా డెంగీ, మలేరియా, ఇతర సీజనల్ జ్వరాలతో మంచానపడిన మండల ప్రజలు అనేక మంది గ్రామాల్లో ఉన్న సమస్యల కారణంగా మరే ఇతర రోగాలు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే పట్టణానికి చెందిన కోడిమాంసం వ్యాపారులు వ్యాపారం అనంతరం మిగిలిన వ్యర్థాలను నగరానికి అతి దగ్గరగా ఉన్న గ్రామాల్లోని రోడ్ల వెంబడి పడేస్తున్నారు. వర్షాలు పడిన సమయంలో ఆ వ్యర్థాలు మొత్తం రోడ్లపైకి చేరటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. అలాగే వాటి నుంచి వెలువడే దుర్వాసన ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది.

పట్టించుకోని పంచాయతీ సిబ్బంది

పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవటంలేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా సమస్య మరింత జటిలమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడిన సమయంలో అనేక గ్రామాలు మురుగునీటిలో తాండవమాడాయని అయినప్పటికీ పంచాయతీ సిబ్బంది కనీస చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విషజ్వరాలు ప్రబలుతున్న గ్రామాల్లో సున్నం, బ్లీచింగ్ చల్లించిన పాపాన పోలేదని అంటున్నారు. పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రక్తదానంపై అవగాహన పెంపొందించాలి

డీఎస్పీ మురళీధర్



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డీఎస్పీ, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్

అవనిగడ్డ: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ సూచనలతో పోలీస్‌శాఖ, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిబిరాన్ని డీఎస్పీ మురళీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం వల్ల అత్యవసర సమయాల్లో మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో రక్తదానం ఆవశ్యకతను ప్రజలకు తెలియజేసేందుకు రెడ్‌క్రాస్ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ టీఎస్ఎస్ బాలాజీ మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు యువత, విద్యార్థులు ముందుకు రావాలని సూచించారు. దివిసీమలో ఎక్కువగా రక్తదాన శిబిరాలు జరుగుతున్నాయని మిగిలిన ప్రాంత ప్రజలు స్ఫూర్తిగా తీసుకుని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 50 మంది పోలీసులు, విద్యార్థులు రక్తదానం చేశారు. సీఐ యువకుమార్, రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ వంగర శేషగిరి రావు, జిల్లా కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, ఎస్‌ఐ శ్రీనివాస్ పర్యవేక్షించారు. బీజేపీ, జనసేన నాయకులు, పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేతో శాశ్వత పరిష్కారం



మెరకనపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీవిద్య

టేకుపల్లి(మోపిదేవి):రీ సర్వే వల్ల భూమికి సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. మండలంలోని టేకుపల్లిలో రీ సర్వే ప్రాజెక్టుపై గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మి అధ్యక్షన మెరకనపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో రైతుల నుంచి పలు అభ్యంతరాలు, సమస్యలపై అర్జీలు స్వీకరించారు. రైతు ఆకుల గోపాలకృష్ణకు చెందిన 60 సెంట్లు, పక్కనున్న రైతు రాయన బిక్షం పేరున సూచిస్తోందని, బిక్షం పేరున ఉండాల్సిన 40 సెంట్లు తన పేరున ఎల్‌పీలో సూచిస్తోందని ఈ మార్పులు సరిచేయాలని అధికారులను కోరారు. యలమంచిలి లీలకు అడంగల్‌లో 5 ఎకరాలు ఉండగా, ఎల్‌పీలో మాత్రం 4.52 సెంట్లు సూచిస్తోందని తగ్గిన 8 సెంట్లు భూమి సరిచేసి పెట్టాలని కోరారు. బండి భూషయ్యకు 1.65 ఎకరాలు ఉండగా ఎల్‌పీలో మాత్రం 1.50 ఎకరాలు సూచిస్తోందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముత్యాల మౌనికకు చెందిన 46 సెంట్ల భూమి ఉండగా, ఎల్‌పీలో తగ్గినట్లు సూచిస్తోందని సరిచేసి పెట్టాలని అధికారులకు వినతిపత్రాలు అందచేశారు. ఇన్‌ఛార్జ్ ఆర్‌ఐ ఎం శ్రీనివాసరావు, వీఆర్వోలు ఎం వెంకటేశ్వరావు, ప్రశాంత్, గ్రామ సర్వేయర్లు గోపీరాజు, హంపి, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పశుగణనతో ప్రత్యేక కార్యక్రమాలు

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



పశుగణన పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, పశు వైద్యాధికారులు

అవనిగడ్డ:21వ అఖిలభారత పశుగణన కార్యక్రమాన్ని పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ కోరారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం పశుగణన కార్యక్రమ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పశుపోషకులు తాము పెంచుతున్న గొర్రెలు, మేకలు, పశువులు, ఎద్లు, ఆవులు, పందుల వివరాల సమాచారాన్ని క్షేత్రస్థాయిలో అధికారులకు తెలియజేయాలని కోరారు. దీనివల్ల పశు సంరక్షణ, రాయితీలు, పశుపెంపకంపై ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉందన్నారు. అవనిగడ్డ సబ్ డివిజన్ అసిస్టెంట్ డాక్టర్ బి. సాంబశివరావు మాట్లాడుతూ కచ్చితమైన వివరాలు అందించాలని సూచించారు. చల్లపల్లి సబ్‌డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ ఎం.నందకిశోర్, కోడూరు, వేకనూరు, నాగాయలంక, మోదుమూడి పశువైద్యాధికారులు డాక్టర్ ఎండీ షఫీ, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సాయిమౌనిక, డాక్టర్ సుధారాణి పాల్గొన్నారు.

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక):పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అఖిల భారత పశుగణన కార్యక్రమం మండల కేంద్రంలో శనివారం పశు వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ సాయిమౌనిక నేతృత్వంలో వక్కపట్లవారిపాలెం గ్రామం క్షేత్రస్థాయిలో రైతులతో కలసి పోస్టర్లు ఆవిష్కరించి పశుగణనను సర్పంచ్ అంబటి శ్యామ్ ప్రసాద్ ప్రారంభించారు.

యూనిఫాం కోసం రూ.10 వేలు అందజేత



పెడన:భట్ల జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జిల్లా స్థాయి ఆటల పోటీలకు హాజరయ్యే విద్యార్థుల యూనిఫాం కోసం విశ్రాంత విద్యాశాఖాధికారి మట్టా రాధాకృష్ణమూర్తి రూ.10వేలు విరాళాన్ని అందజేశారు. శనివారం పాఠశాల అసెంబ్లీ సమయంలో నగదును హెచ్‌ఎం తీర్ధవతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్

కోడూరు:రహదారులపై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్‌ఐ చాణక్య తెలిపారు. శనివారం ఆయన పలుచోట్ల వాహనాలను విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించగా, ఓవర్ లోడుతో వెళుతున్న ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ చేశారు.

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ సందర్శన

అవనిగడ్డ:వ్యవసాయ రంగంలో రైతులు వినియోగించే ఎరువులు, విత్తనాల నాణ్యత పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకురాలు ఎ.వీరకుమారి ఆధ్వర్యంలో బీఏ విద్యార్థులు స్థానిక అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎరువులు, పురుగు మందులు, విత్తనాల కల్తీని కనిపెట్టేందుకు చేపట్టే పరీక్షలను వ్యవసాయ విస్తరణ అధికారి సురేష్ వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు లావణ్య, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రాచీన కళలను పరిరక్షించాలి



కార్పెంటర్ వర్క్‌ను తెలుసుకుంటున్న విద్యార్థులు

మచిలీపట్నంటౌన్:ప్రాచీన కళలను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ అన్నారు. నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో శనివారం బ్యాగ్ రహిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేశీయ జానపద నృత్య పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత అనే అంశంపై వైద్యురాలు పద్మ అవగాహన కల్పించారు. విద్యార్థులు పళ్లు ఎలా తోముకోవాలో శిక్షణ ఇచ్చారు. స్లోగన్ పోటీలు, పోస్టర్ తయారీ, క్రికెట్, ఖోఖో, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. విపత్తుల నిర్వహణ అంశంపై ఏఆర్‌కె ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పని విద్యలో భాగంగా వడ్రంగి పనిపై కార్పెంటర్ కోటేశ్వరరావు విద్యార్థులకు ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. టైలరింగ్‌లో పదో తరగతి విద్యార్థి జస్వంత్ తల్లి విజయ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

గ్రామసభలో 11 అర్జీలు

మల్లంపల్లి(ఘంటసాల):గ్రామంలో రీ సర్వే భూ సమస్యల పరిష్కారానికి శనివారం గ్రామ సభ నిర్వహించారు. భూముల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 11 మంది రైతులు అర్జీలు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెల్లంకొండ అమలేశ్వరరావు, రీ సర్వే డీటీ పి.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ వల్లీ పుష్ప, వీఆర్వో మనీషా, ఈవో అబ్దుల్ నయూమ్, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

గూడూరు:రీ సర్వేల్లో తలెత్తిన సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తుందని రీ సర్వే విభాగం గూడూరు మండల డెప్యూటీ తహసీల్దారు కె.సాయి తెలిపారు. కప్పలదొడ్డి పంచాయతీ కార్యాలయంలో శనివారం రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన రీ సర్వేలో తలెత్తిన సమస్యలను రైతులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. తద్వారా 15 రోజుల్లో ఆయా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సర్పంచ్ యక్కల మాధవి అధ్యక్షతన సభ నిర్వహించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థినులు, ఉపాధ్యాయులతో ప్రిన్సిపల్ రూతమ్మ

పెడన:జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఈ నెల 22వ తేదీన వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో నిర్వహించారని, ఈ ప్రదర్శనలో పెడన మండలం బల్లిపర్రు గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు విశేష ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ ఎస్.రూతమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్స్ విభాగంలో వరదలను ముందుగా గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయడంపై కె.మీనాక్షి (ద్వితీయం), యాంగిల్ సమ్ ప్రాపర్టీ ఆఫ్ ట్రైయాంగిల్‌లో డి.మమతశ్రీ(ద్వితీయం), వేస్ట్ టు క్రాఫ్ట్ విత్ జ్యూట్ ప్రదర్శనలో జి. మాన్విత (ద్వితీయం), సీనియర్స్ విభాగంలో వేస్ట్ టు క్రాఫ్ట్ విత్ పేపరులో పి.పూజితలు ద్వితీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. వీరు ఈ నెల 28, 29వ తేదీల్లో ద్వారాకా తిరుమల గురుకుల పాఠశాలలో జరిగే జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను, వారికి సహాయకులుగా ఉన్న విద్యార్థులను, గైడ్ టీచర్లు స్వర్ణలత, పల్లవి, శశికళలను తనతో పాటు ఉపాధ్యాయులు అభినందించారని పేర్కొన్నారు.

రహదారుల మరమ్మతులకు రూ.1.80 కోట్లు మంజూరు

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ:నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతులకు రూ.1.80 కోట్లు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చల్లపల్లి – నడకుదురు రోడ్డు మరమ్మతుకు రూ.15 లక్షలు, భావదేవరపల్లి – సంగమేశ్వరం రహదారికి రూ.10 లక్షలు, నాగాయలంక – నాలి రహదారికి రూ.30 లక్షలు, రామానగరం – నడకుదురు రోడ్డుకి రూ.40 లక్షలు, గుడివాడ – చల్లపల్లి – కొత్తపాలెం రోడ్డుకి రూ.30లక్షలు, రామానగరం – నడకుదురు రోడ్డుకి రూ.25 లక్షలు, టి కొత్తపాలెం – గుల్లలమోద రోడ్డుకి రూ.30 లక్షలు నిధులు మంజూరైనట్లు చెప్పారు. నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి బీసీ జనార్ధనరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కష్టపడి చదివితే విజయం



డీఎస్పీని సత్కరిస్తున్న ఎంపీపీ, సర్పంచ్, సీఐ

చల్లపల్లి(అవనిగడ్డ):సరైన ప్రణాళికతో కష్టపడి చదివితే ప్రతి ఒక్కరికీ విజయం వరిస్తుందని డీఎస్పీ మురళీధర్ చెప్పారు. చల్లపల్లి విజయక్రాంతి జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళితే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని చెప్పారు. విద్యార్థి దశలో చెడు సహవాసాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ సమాజ సేవలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సెల్‌ఫోన్‌ని విజ్ఞానానికి ఉపయోగపడేలా వాడుకోవాలని, సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం డీఎస్పీని సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అవనిగడ్డ ఎస్‌ఐఎల్ క్రాంతి విద్యాసంస్థల అధినేత దుట్టా ఉమామహేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, సీఐ ఈశ్వరరావు, ఎంపీపీ కోట విజయరాధిక, విజయక్రాంతి విద్యాసంస్థల అధినేత దుట్టా శివరామప్రసాద్‌తో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బియ్యం పట్టివేత

పెడన:పట్టణంలోని తోటమూల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కుకింగ్ ఏజెన్సీ నిర్వహకురాలు మధ్యాహ్న భోజన పథకం బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా స్థానికులు పట్టుకుని కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబుకు సమాచారం తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈ సంఘటన చోటు చేసుకోవడంతో కౌన్సిలర్ చంద్రబాబు హెచ్‌ఎం నాగేశ్వరరావును ప్రశ్నించారు. హైస్కూల్ నుంచి మధ్యాహ్నం భోజన పథకం నిర్వాహకురాలు మూడు సంచుల్లో సుమారు వంద కిలోలు వరకు ఉన్న రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా స్థానికులు అడ్డుకొని కౌన్సిలర్‌కు తెలియజేయశారు. బియ్యాన్ని ఎక్కడికి తరలిస్తున్నారని నిర్వాహకురాలిని ప్రశ్నించగా ఆమె చాలా నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడమే కాకుండా మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఆయన హైస్కూలు హెచ్‌ఎం నాగేశ్వరావుకు ఫిర్యాదు చేసి ఆటో వద్దకు తీసుకువెళ్లి చూపించారు. మీకు తెలియకుండా బియ్యం తరలి వెళ్లడం ఏమిటంటూ నిలదీశారు. ఈ విషయాన్ని చంద్రబాబు విద్యాశాఖ ఉన్నతాధికారులకు తెలియజేశారు. బియ్యం బయటకు వెళ్తున్నట్లు తనకు తెలియదని, ఇక నుంచి అలా జరగకుండా చూస్తానని హెచ్‌ఎం నాగేశ్వరరావు చెప్పారు. ఏజెన్సీ నిర్వాహకురాలు హెచ్‌ఎంకు తెలియదని, వారికి తెలియకుండా తీసుకువెళ్లి సుద్ద అవుతున్న బియ్యాన్ని మార్చి మంచి బియ్యం తీసుకొచ్చి విద్యార్థులకు పెడుతున్నట్లు తెలిపింది. అయితే కేజీ పదిహేను రూపాయలు చొప్పున తమకు అమ్ముతుందంటూ కొన్న వ్యక్తి ఆ నిర్వాహకురాలు ముందే తెలియజేయడంతో హెచ్‌ఎం, ఏజెన్సీ వారు నుంచి సమాధానం లేదు. దీనిపై పూర్తి స్థాయిలో విద్యాశాఖ ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి దీని వెనుక ఎవరు బాధ్యులున్నారో నిగ్గు తేల్చాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

ఘంటసాల: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని సిబ్బంది రైతులకు మెరుగైన, నాణ్యమైన సేవలందించాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. ఘంటసాల వెలుగు కార్యాలయంలో రైతు సేవా కేంద్రాల ద్వారా జరిగే ధాన్యం కొనుగోలు చేసే విధానం పై గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పౌర సరఫరాల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ కె.శారద శనివారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ఉండే సిబ్బంది ధాన్యం సేకరణ, తేమ శాతం పరిశీలన, పేర్లు నమోదు, తదితర అంశాలపై వీఏఏలు, టీఏలకు, డీఈఓలకు శిక్షణ ఇచ్చారు.

అనుమతుల్లేకుండా ఇసుక తవ్వకాలు



పాపవినాశనం వద్ద కృష్ణానదిలో పడవ నుంచి ట్రాక్టర్లోకి ఇసుక డంపింగ్ చేస్తున్న దృశ్యం

పాపవినాశనం(ఘంటసాల): కృష్ణానదిలో ఎలాంటి అనుమతుల్లేకుండా పడవలు సాయంతో ఇసుకను తీసుకొచ్చి ట్రాక్టర్లు ద్వారా అమ్ముకుంటున్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో ప్రభుత్వం రెండు ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇవ్వగా పాపవినాశనం గ్రామంలో ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. పాపవినాశనం గ్రామంలో అనుమతుల్లేని ఇసుక క్వారీలో బాపట్ల జిల్లా గాజుల్లంక, పోతార్లంక గ్రామాలకు చెందిన వారు ఐదు నాటు పడవల ద్వారా కృష్ణానదిలోని మెరక ప్రాంతాల్లోని ఇసుకను తీసుకొచ్చి పాపవినాశనం గ్రామంలోని ఇసుక రీచ్ వద్ద చల్లపల్లి మండలం చల్లపల్లి, నడకుదురు, నిమ్మగడ్డ, తదితర గ్రామాలకు చెందిన సుమారు 25 నుంచి 30 ట్రాక్టర్లలో నింపుతున్నారు. దీనికి ఒక్కో ట్రాక్టర్ నింపినందుకు రూ.2,500 పడవల వారు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. దీని పై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయగా ట్రాక్టర్ల డ్రైవర్లతో పాటు వేరే ప్రాంతానికి చెందిన ఓ అధికార పార్టీ నేత ప్రభుత్వం ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించడానికి అనుమతులు ఇచ్చిందని, అపడానికి మీరు ఎవరంటూ స్థానికులు, ఫొటోలు తీస్తున్న మీడియా పై చిందులు తొక్కుతూ దౌర్జన్యానికి దిగారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు తహసీల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌లు స్పందించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ కుంపటి అనిత మాట్లాడుతూ తమ గ్రామంలో ఉన్న ఇసుక క్వారీలో బయట గ్రామాలకు చెందిన వ్యక్తులు వచ్చి ఇసుక తవ్వకాలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

విద్యార్థులు అవకాశాలు అందిపుచ్చుకోవాలి



శిక్షణ తరగతులపై విద్యార్థులతో ముచ్చటిస్తున్న వీసీ శ్రీనివాసరావు

కోనేరుసెంటర్:వారం రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఆర్. శ్రీనివాసరావు తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 21న ప్రారంభమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. శిక్షణ ఎంత మేర ఉపయోగకరంగా ఉన్నదీ లేనిదీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది విద్యార్థులతో వీసీ మాట్లాడారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వి జయకుమారి మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి ఖర్చు లేకుండా వీసీ ఆచార్య ఆర్. శ్రీనివాసరావు చొరవతో ఏర్పాటు చేసినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. టాలెంట్ షైన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ నుంచి ఉదయ్ అనే కోడింగ్, ప్రోగ్రామింగ్ నిపుణుడు పైథాన్, జావా వంటి కోడింగ్ నైపుణ్యాలు నేర్పించారన్నారు.

కేయూలో గ్రీన్‌పార్కు ఏర్పాటు



కాలేజీ ఆవరణలో గ్రీన్‌పార్కును ఏర్పాటుచేసిన అధ్యాపకులు, విద్యార్థులు

కోనేరుసెంటర్:కృష్ణా విశ్వవిద్యాలయంలో నాక్ బృందం పరిశీలన వల్ల కొన్ని అదనపు హంగులు సమకూరాయి. బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఆవరణలు గ్రీన్ పార్క్, బయోడైవర్సిటీ పార్క్, ఆక్వా చెరువు, ఆక్వాఫోనిక్ యూనిట్, వర్మి కంపోస్టు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి వల్ల విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకుని మరింత విజ్ఞానం పెంచుకుంటారని విభాగ అధిపతి ఎల్.సుశీల ఆశాభావం వ్యక్తం చేశారు. బయోటెక్నాలజీ విభాగంలో పనిచేస్తున్న ఆచార్య మారుతి, సహ ఆచార్య డాక్టర్ వీర బ్రహ్మచారి, డాక్టర్ మాధురి, డాక్టర్ సురేష్, డాక్టర్ స్వరూప, డాక్టర్ కిషోర్ పాల్గొన్నారు.